ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 25, క్యారెట్ 23, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 60, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 19, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 27, చామగడ్డ 47, మొరంగడ్డ 17, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటి కాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అభినందనలు



తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దీపక్ జాన్‌ను దళిత బహుజన సామాజిక నాయకుడు కృష్ణారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. -బౌద్ధనగర్

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

పద్మారావునగర్: దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని, సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలు మరోమారు బీజేపీని ఆశీర్వదించాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడిహెచ్ కాలనీలో మంగళవారం బీఆర్‌ఎస్‌కు చెందిన అంగముత్తు శ్రీనివాస్, మిట్టపల్లి శ్రీనివాస్, కె. కిషన్, నర్సింగ్ రావు, మాళవిక తదితరులు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం నీతివంతమైన, ధర్మపాలన సాగిస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి పాలన, చేసిన అభివృద్ధి రానున్న ఎన్నికల్లో తమ విజయానికి దోహదపడుతాయన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ మరోమారు జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, డాక్టర్ గౌతమ్ కుమార్, టి.రాజశేఖరరెడ్డి, ఎ. ఆనంద్ యాదవ్, మర్రి పురురవరెడ్డి, ఎస్. రాజు, ఉమేష్ ఖండెల్వాల్, కుర్మ శంకర్, గుంటి సత్యనారాయణ, వై. సురేష్‌కుమార్, వై. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో భారత్..

బన్సీలాల్‌పేట్: ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని బండమైసమ్మనగర్, చాచానెహ్రూనగర్ బస్తీల్లో పలు ప్రజాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి..దేశంలో



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

పేదలు, అట్టడుగువర్గాల సంక్షేమ, అభివృద్ధికి అనేక కార్యక్రమాలను కేంద్రం అమలు చేస్తున్నదని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పేదల వైద్య ఆరోగ్యానికి



నూతన పవర్‌బోర్లను ప్రారంభిస్తూ..

పెద్దపీట వేసిందన్నారు. అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరోసారి ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందు ఆయన రూ. 18లక్షల వ్యయంతో బన్సీలాల్‌పేట్ బండమైసమ్మనగర్ డబుల్ బెడ్రూమ్ ప్రాంగణంలో నూతన పవర్ బోర్‌వెల్, చాచానెహ్రూనగర్‌లో రెండు బోర్‌వెల్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్ గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, సురేష్‌కుమార్, ఉమేష్ ఖండెల్వాల్, శ్రీశైలం గౌడ్, పెద్ది రవీందర్, ఎస్. రాజు, శ్రీనివాస్, హరినాథ్, శివలింగం, శివరామక్రిష్ణ, ఎస్.వై. గిరి, విద్యామోహన్, సత్యనారాయణ, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

నకిలీ బోర్‌వెల్ సర్వేలతో రైతులకు నష్టం

ఉస్మానియా యూనివర్సిటీ: నకిలీ బోర్‌వెల్ సర్వేలతో రైతులకు నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర హైడ్రోజియాలజిస్ట్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డా.రామావత్ హరి మాట్లాడుతూ.. భూగర్భశాస్త్రం (జియాలజీ) కనీస అవగాహన లేని వ్యక్తులు రాష్ట్ర వ్యాప్తంగా బోర్ పాయింట్లను చూస్తామని రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి నీళ్లు రావడం లేదని, ఇది అదునుగా భావించిన నకిలీ జియాలజిస్టులు విషయ పరిజ్ఞానం లేకున్నా యూట్యూబ్ చానల్స్ ద్వారా కొన్ని విషయాలు జియాలజిస్టులుగా చలామని అవుతూ రైతులకు బోరు పాయింట్లను చూపిస్తూ వేలల్లో దండుకుంటున్నారని ఆరోపించారు. విషయం అసోసియేషన్ దృష్టికి రావడంతో నకిలీ జియాలజిస్టులపై కేంద్ర భూగర్భ జలశాఖ సౌత్ రిజియన్ డైరెక్టర్ డా.కృష్ణమూర్తికి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఫిర్యాదు స్వీకరించిన డైరెక్టర్ నకిలీ జియాలజిస్టుల ఆట కట్టించేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు శాఖ సహకారం తీసుకోనున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులకారం విష్ణు, తిరుమలేష్, మిట్టల్, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో భోజనశాల ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం నిర్మించిన కిన్నెర హాస్టల్ భోజనశాలను మంగళవారం వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.29.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న హాస్టల్ భవనంలో ఏర్పాటు చేసిన కిచెన్, మెస్ హాల్ తొలుత అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. మెస్‌హాల్లో 237 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయవచ్చని ఇంజినీరింగ్ విద్యార్థులకు 20 ఏళ్ల వరకు హాస్టల్ సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్న విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ విద్యాసాగర్, ప్రొ.మంగు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌కు తరలిన మహిళలు



బస్సును ప్రారంభిస్తున్న ఆదం సంతోష్‌కుమార్

సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పరేడ్ మైదానంలో మంగళవారం నిర్వహించిన మహిళా సదస్సుకు సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివెళ్లారు. జీహెచ్‌ఎంసీ అర్బన్ కమ్యూనిటీ ఆఫీసర్ల పర్యవేక్షణలో సదస్సుకు తరలివెళ్లే మహిళలకు వసతులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నుంచి తరలివెళ్లిన బస్సుల ర్యాలీని సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఆదం సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పొదుపు సహకార సంఘాల మహిళలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు.

పాఠశాల అదనపు అంతస్తు ప్రారంభం

రసూల్‌పురా: 18 ఏళ్లు పైబడిన వారికి వివిధ అంశాల్లో శిక్షణ అందజేసేందుకు ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తామని తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా (టాసా) కంటోన్మెంట్ బ్రిగేడియర్ సోమ శంకర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం పథకంలో భాగంగా రూ.35 లక్షల వ్యయంతో స్ఫూర్తి మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల భవనం మొదటి అంతస్తును సోమ శంకర్, బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో రసూల్‌పురాలో గత 16 ఏళ్లుగా స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. సీఈవో మధుకర్ నాయక్ ప్రత్యేక అవసరాల పిల్లలకు తగిన విధంగా శిక్షణ అందజేస్తున్న ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ లతను అభినందించారు. బోర్డు తరపున పూర్తి సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు బొల్లారం కంటోన్మెంట్ జనరల్ హాస్పిటల్ జైన్ సమాజం ఆధ్వర్యంలో రూ.22 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను బ్రిగేడియర్, సీఈవో అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీఈవో, ఇంజినీరింగ్ అధికారులు బాలకృష్ణ, ఉమాశంకర్, సాగర్, ప్రిన్సిపల్ లత, విద్యార్థులు పాల్గొన్నారు.



భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న బ్రిగేడియర్, సీఈవో

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి సారించాలి

సికింద్రాబాద్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి ఎస్.ఎల్లారెడ్డి కోరారు. మంగళవారం సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ నోడల్ అధికారి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి సహా పలు పీఎస్‌లకు చెందిన పోలీసు అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పీఎస్‌ల వద్ద ప్రశాంత వాతావరణం ఉండే విధంగా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు అమలులోకి తేవాలన్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులు సమష్టి కృషి చేయడం ద్వారా పోలింగ్ శాతాన్ని పెంచవచ్చన్నారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు పోలీసు అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్‌రావు, ఎన్నికల విభాగం ఇన్‌ఛార్జి కేజభుజేందర్‌బాబు, పోలీసు సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నాయకులు

అమీర్‌పేట: బల్కంపేట బీజేఆర్‌నగర్‌లో జలమండలి అధికారులు రెస్టోరేషన్ పనులు చేపట్టారు. కొన్ని చోట్ల పనులు చేయడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి పనులను పరిశీలించారు. జలమండలి అధికారులతో మాట్లాడిన ఆమె ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేయాలని కోరారు. ఆమె వెంట కట్ట బల్‌రాం,కూతురు నర్సింహ, అనిల్ ఉన్నారు.

వంశీచంద్‌రెడ్డిని గెలిపించుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంపీగా వంశీచంద్ రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేయనున్నట్లు పాలమూరు నిరుద్యోగ ఫోరం అధ్యక్షులు చుక్క రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో జరిగిన పాలమూరు నిరుద్యోగుల ఫోరం సమావేశంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించడం కరువు నేలపై వర్షం కురిసినంత ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేస్తున్న వంశీచంద్ రెడ్డి గతంలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా యువత అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించి ఆయనను పార్టీ గుర్తించి ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించినందుకు వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. రాఘవేంద్ర, ఓంకార్, సుధాకర్, శంకర్, నరేష్, కురుమయ్య, జానకిరామ్, సురేష్, విష్ణువర్ధన్, ప్రవీణ్‌రెడ్డి, లింగన్న, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీని మూడోసారి ప్రధానిని చేయాలి

కంటోన్మెంట్: సమర్థవంతమైన పరిపాలన, దేశ సమగ్ర అభివృద్ధి కోసం నరేంద్రమోదీని మూడవసారి ప్రధానిని చేయాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోడలు షమితారెడ్డి కోరారు. మంగళవారం బోయిన్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలోని కృష్ణస్వామి స్పోర్ట్స్ అకాడమీ మైదానంలో మార్నింగ్ వాకర్స్‌తో ఆమె సమావేశమై మాట్లాడారు. పదేళ్ల నరేంద్రమోదీ పాలనలో అవినీతి, అక్రమాలకు అవకాశం లేకపోగా ప్రపంచంలోని అగ్ర దేశాల సరసన భారత్ 5వ స్థానంలో చేరిందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజల మనిషి ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రిటైర్డ్ పోలీస్ అధికారి సీహెచ్.లింగన్న, సీబీఐటీ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిరాంరెడ్డి, బండి శ్రీనివాస్, నారాయణరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, చారి, లింగం సేటు పాల్గొన్నారు.



మార్నింగ్ వాక్‌లో షమితారెడ్డి

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డా.జె చిన్నబాబు రచించిన ఫిజిక్స్ పుస్తకాన్ని ప్రిన్సిపల్ డా. జి సుకన్య మంగళవారం ఆవిష్కరించారు. తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం ఇంటర్ బోర్డులో భౌతికశాస్త్రం పుస్తక రచయితలో ఒకరైన డా. చిన్నబాబును ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కాలేజీ స్టాఫ్ క్లబ్ సభ్యులు డా.కిశోర్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో బంపర్ ఆఫర్

రాంగోపాల్‌పేట: ప్రముఖ ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రేత బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సమ్మర్ స్పెషల్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. సికింద్రాబాద్ ఎంజీరోడ్డు షోరూంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నటీమణులు స్రవంతి చొక్కారపు, చాందినీ భగవంత్, ప్రసన్న, ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ ఊర్మిల చౌహాన్ బంపర్ ఆఫర్ డ్రా ప్రారంభించారు. బంపర్ ఆఫర్‌లో రూ. 50 లక్షల క్యాష్ ప్రైజ్‌తో పాటు 30 ఆల్టోకే 10 కార్లు వినియోగదారులకు అందిస్తున్నట్లు బజాజ్ ఎలక్ట్రానిక్స్ సీఈఓ కరణ్‌బజాజ్ తెలిపారు. ఏసీలు, కూలర్లపై ఆకర్షణీయమైన క్యాష్ బ్యాక్ ఆఫర్లు, సులభమైన నెలసరి వాయిదాలు చెల్లించే వెసులుబాటు కల్పించామన్నారు.



ఆఫర్ డ్రా ప్రకటిస్తున్న దృశ్యం

వినియోగదారుల కమిషన్ సభ్యుల నియామకాల్లో అనిశ్చితి

కన్జ్యూమర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు శివరాం

హిమాయత్‌నగర్: తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వినియోగదారుల కమిషన్ సభ్యుల నియామకాల విషయంలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొందని 'కన్జ్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' రాష్ట్ర అధ్యక్షుడు మల్లు శివరాం అన్నారు. వినియోగదారుల హక్కులు, సేవల కోసం నిరంతరం పనిచేసే కమిషన్‌లో ప్రస్తుతం జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా జిల్లాల కమిషన్ సభ్యుల నియామకంలో అనిశ్చిత పరిస్థితి నెలకొందన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డి.శారద, ఉపాధ్యక్షులు కూరపాటి మధు, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కె.జోసెఫ్‌తో కలసి మల్లు శివరాం మాట్లాడారు. రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో గత కొంతకాలంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పాలన కొనసాగుతోందన్నారు. తెలంగాణ హైకోర్టు గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను నిలిపివేయడం వల్ల కమిషన్ సభ్యులు ఇబ్బంది పడాల్సి వచ్చిందని, నిబంధనల విషయంలో జాగ్రత్తలు తీసుకోకుండా నోటిఫికేషన్ ఇచ్చిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వినియోగదారుల రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేసిన డబ్బుల విషయంలోనూ అవకతవకలు జరిగాయని, దీనిపై సివిల్ సప్లైస్ కమిషనర్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శివరాం డిమాండ్ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

రసూల్‌పురా: అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నా ప్రపంచ వ్యాప్తంగా మహిళ తనను తాను నిరూపించుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం సీతారాంపురంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మద ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాలకు ఈటల హాజరై మాట్లాడారు. నేటి యువత ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగాలని భావిస్తోందని తనకంటూ ప్రత్యేకత సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోందని అన్నారు. బీజేపీ నాయకులు శ్రీ గణేష్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ మహిళలకు పెద్దపీట వేస్తూ 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారన్నారు. వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, స్వరూప, పద్మ, అనురాధ, లక్ష్మి, రమణి, సుజాత, జయశ్రీ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రిహాబిలైజేషన్ సైన్సెస్ సెంటర్‌లో..

రసూల్‌పురా: మహిళల సాధికారతకు మహిళలే కృషి చేయాలని స్వీకార్ అకాడమీ ఆఫ్ రిహాబిలైజేషన్ సైన్సెస్ వైస్ చైర్మన్ డాక్టర్ నిర్మల హనుమంతరావు పేర్కొన్నారు. స్వీకార్ అకాడమీ ఆఫ్ రిహాబిలైజేషన్ సైన్సెస్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవాలకు డాక్టర్ నిర్మల పాల్గొని మాట్లాడారు. తమ సంస్థలో దివ్యాంగుల ఉన్నతితో పాటు ఉద్యోగం చేస్తున్న 80 శాతం మహిళల ఉన్నతికి విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. జీయస్ ఓవర్సీస్ కేరియర్ డైరెక్టర్ గిరిజా సంపత్ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లౌడ్ బాక్స్ 99 వైస్ ప్రసిడెంట్ అనుపమ రామగిరి, సత్యవతి కాట్రాగడ్డ, మధుమతి అట్లూరి, ముక్కు కళ్యాణి, వాణికుమారి, లావణ్య, దీపా, కుమారి, చిత్ర ఐరావతం, ప్రవీణ, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్లో..

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్లో స్థానిక మహిళా సామాజిక సేవకుల ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలందరూ కలిసి కేక్ కట్ చేశారు. నేటి సమాజంలో మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. సంఘటితంగా హక్కులను సాధించుకోవాలని మహిళలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకురాలు వసంత, సువర్ణ, భాగ్య, విజయ, అంజమ్మ, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న మహిళలు

జీతాలివ్వని యజమానిపై కేసు

అడ్డగుట్ట: ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న యజమానిపై కేసు నమోదైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పల్లె పద్మ వివరాల ప్రకారం.. విజయపురి కాలనీలో వినిల్ ఐటీ సర్వీసెస్ అనే కార్యాలయాన్ని జేసుదాస్(42) అలియాస్ జోసెఫ్ అలియాస్ జేమ్స్ అనే వ్యక్తి నడుపుతున్నాడు. అయితే అందులో ఉద్యోగం చేస్తున్న వారికి కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. దీంతో ఉద్యోగులందరూ ఎంత అడిగినప్పటికీ జేసుదాస్ స్పందించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిస్సహాయ విద్యార్థులకు చేయూత

కాచిగూడ: తండ్రి, సంరక్షకుడిని కోల్పోయిన విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. అర్హులైన మున్నూరుకాపు విద్యార్థులు ఈనెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 28న కాచిగూడ మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో జరిగే కార్యక్రమంలో ఆర్థికసాయం చేస్తామన్నారు. వివరాలకు 040-24658160, సెల్: 9491627404.

బీసీలను మోసం చేస్తున్న పార్టీలను ఓడించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ లోగోను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ దేశాన్ని పాలిస్తూ వస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ దేశ జనాభాలో సగానికి పైగా బీసీల అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఎన్నికల్లో బ్లూ ఇండియా పార్టీ ద్వారా మాత్రమే సామాజిక న్యాయం దక్కుతుందని ఆ దిశగా బీసీలు చైతన్యవంతం కావాలన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి భూపాల్, కోశాధికారి బోంపల్లి మధు, ఉపాధ్యక్షులు షేక్ అమానుద్దీన్, సుంకర్ లింగారెడ్డి, కార్యదర్శులు రాకేష్ నాయక్, శ్రీలత, విఠల్ పాల్గొన్నారు.

కిడ్నాపర్‌గా అనుమానంతో మహిళకు దేహశుద్ధి

- పోలీసుల విచారణలో దొంగగా నిర్ధారణ
- రిమాండ్‌కు తరలింపు

రాంగోపాల్‌పేట్: ఇంటి ముందు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళను చూసిన స్థానికులు పిల్లలను ఎత్తుకుని పోయే కిడ్నాపర్‌గా భావించి పోలీసులకు అప్పగించారు. సదరు మహిళ రోజంతా నోరు విప్పకపోవడంతో పాటు పొంతనలేని సమాధానాలతో పోలీసులను ముప్పుతిప్పలు పెట్టింది. అదే సమయంలో ఆమె చేతివాటంతో బంగారు, నగదు పోగొట్టుకున్న బాధితుడు వచ్చి ఫిర్యాదు చేయడంతో దొంగగా నిర్ధారించారు. సోమవారం సాయంత్రం రెజిమెంటల్‌బజార్‌లో ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు పొంతనలేని సమాధానాలు చెబుతూ మతిస్థిమితం లేని మహిళగా మాట్లాడుతూ పోలీసులనే బోల్తా కొట్టించేందుకు యత్నించింది. సరైనా చిరునామా చెప్పకుండా పోలీసులను వివిధ ప్రాంతాల్లో తిప్పింది. అవన్నీ తప్పుడు మాటలుగా పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా ఆమె ఫింగర్ ప్రింట్, పాత నేర చరిత్ర కోసం వెదికినా ఎక్కడ కనిపించ లేదు. కానీ ఆమె మహిళ కావడం, దానికితోడు పిచ్చిపిచ్చి సమాధానాలు చెబుతుండటంతో పోలీసులు దర్యాప్తు చేయలేక తలలు పట్టుకున్నారు. అదే సమయంలో ఆ మహిళ దగ్గర లభించిన ఫోన్ ద్వారా దర్యాప్తు చేస్తే అది అల్వాల్‌కు చెందిన వెంకటేశ్వరరావుదిగా గుర్తించారు. ఆయనను పిలిపించి విచారించగా ఈ నెల 6న భీమవరం వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు రాగా ఓ మహిళ తనను పక్కకు తోసి బ్యాగును లాక్కుని వెళ్లిందని చెప్పాడు. ఆ బ్యాగులో రూ.12 వేల నగదు, 6 గ్రాముల బంగారం, అర కిలో వెండి పళ్లెం ఉందని ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు చేసిన తర్వాత తాను చిలకలగూడలో ఉంటానని, గతంలో సేల్స్ గర్ల్‌గా పనిచేసినట్లు తన పేరు మహేశ్వరి జ్యోతి కుమారి (28) చెప్పింది. తానే ఈ దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో ఆమెను రిమాండ్‌కు తరలించారు.